

మేర కులస్థులను బీసీ 'డీ' నుండి బీసీ 'ఏ' గ్రూప్‌లోకి మార్చే విధంగా ప్రత్యేక జీవో విడుదలయ్యేలా మండలిలో చొరవ తీసుకోవాలని మేరు కుల వృత్తి సంక్షేమ సంఘం ఎంకేవీఎస్‌ఎస్ అధ్యక్షుడు వాడపల్లి మాధవ్ మేర ఆధ్వ ర్యంలో పలువురు ఎమ్మెల్సీ కవితను శుక్రవారం కోరారు. ఎంకెవిఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు కర్నే శ్రీనివాస్, కొత్త పెళ్లి వినోద్‌కుమార్, దికొండ కవిత, ఓదల రమేశ్, పాడిశెట్టి రమేశ్, తాళ్ల శ్రీధర్ ఎమ్మెల్సీని కలిసారు.


నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 21 డిసెంబర్ 2024 HYDERABAD


## నగరానికి 2రోజులు వర్ష సూచన



సిటీబ్యూరో, డిసెంబరు 20 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నగరంలో రాగల రెండు రోజులు అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. వాయుగుండం ప్రభావంతో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే పెరిగి, చలి తీవ్రత తగ్గింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.5డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.3డిగ్రీలు, గాలిలో తేమ 58శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.






# కాంగ్రెస్ వచ్చింది.. మా ఉపాధి పోయింది

- ఆదుకుంటామన్నారు.. గెలిచాక మొండి చేయి చూపారు
- ఆటో డ్రైవర్లను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- అసెంబ్లీని ముట్టడించే యత్నం చేసిన ఆటో డ్రైవర్లు






అసెంబ్లీని ముట్టడించేందుకు ప్రయత్నించిన ఆటో డ్రైవర్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : 'ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. తీరా గెలిచాక మొండి చేయి చూపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మా ఉపాధి అంతా సర్వనాశనమైపోయింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మా ఆటో డ్రైవర్ల జీవితాలను సర్వనాశనం చేసింది' అంటూ ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం అసెంబ్లీని ముట్టడించే ప్రయత్నం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలొచ్చిన వందలాది మంది ఆటో డ్రైవర్లు హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరారు. అసెంబ్లీకి సమీపంలోని పెట్రోల్ బంక్ సిగ్నల్‌పాయింట్ వరకు వెళ్లే మార్గంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులకు ఆటో డ్రైవర్లకు మధ్య తోపులాట జరిగింది. ఆటో డ్రైవర్లందరిని నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. కాగా, రాష్ట్రం నలువైపుల నుంచి నగరానికి చేరుకొని అసెంబ్లీకి ముట్టడికి యత్నించిన ఆటో డ్రైవర్లను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఆటో జేఏసీ నాయకులను ముందుస్తుగానే అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల జేఏసీ నాయకులు మారయ్య, వెంకటేశ్, సత్తిరెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిందని విమర్శించారు. అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే వందలాది మంది డ్రైవర్లు నగరానికి వచ్చారని.. చాలా మందిని అరెస్ట్ చేశారని చెప్పారు. ఉచిత బస్సు స్కీం తీసుకొచ్చి ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి కూడా ప్రభుత్వం సమయం ఇవ్వడం లేదని వాపోయారు. చర్చలకు పిలుస్తామని మాటిచ్చిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆటో డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనే ఆటో డ్రైవర్ల ఉద్యమం ఆగదని.. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వానికి త్వరలో బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సిటీ ఆటో యూనియన్, టీఏస్‌డీయూ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురై ఘట్‌కేసర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

# గురుకులం.. భయం భయం!

## వరుస ఘటనలతో బెంబేలెత్తిపోతున్న విద్యార్థులు

- సంక్షేమ పాఠశాలల్లో చదివించాలంటే భయం వేస్తున్నదంటున్న తల్లిదండ్రులు
- పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోతున్న వైనం

మేడ్చల్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో పెద్ద ఎత్తున నిర్లక్ష్యంతో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలతో ఇటు విద్యార్థులు భయపడిపోతుంటే..అక్కడ చదివించడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రెండు గురుకుల పాఠశాలల్లో 5 రోజులలోనే 2 ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో విద్యార్థుల కుటుంబాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. కీసరలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఐదుగురు విద్యార్థినులను ఎలుకలు కరిచి గాయపర్చిన సంఘటన మరవక ముందే నాగారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 33 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని తీవ్ర అస్వస్థత గురై దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరు డిశ్చార్జి అయ్యారు.అధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే ఈ ఘటనలకు కారణమని తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా నాగారం పాఠశాలను శుక్రవారం సందర్శించి విచారించారు. పిల్లలు తినే భోజనం ఎలా అస్వస్థత పాలు చేసిందనే విషయంపై కారణాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విచారణ ప్రారంభించారు.



నాగారంలోని గురుకుల పాఠశాలల నుంచి ఇంటికి వెళ్తుతున్న విద్యార్థులు

### ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థులు

నాగారంలోని సాంఘిక సంక్షేమ మైనార్టీ గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనతో తీవ్ర ఆందోళన చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోతున్నారు. గురుకుల పాఠశాలల్లో ఒక్కో చోట ఒక్కో రకమైన ఘటన జరుగుతూ ఉంటే.. గురుకులాల్లో చదివించాలంటేనే తమకు భయం వేస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




తనిఖీచేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

# స్టోర్ రూంలో ఎలుకలు గడువు ముగిసిన మసాలాలు

## ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్లడైన నిజాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్నట్టుగా ధగధగలాడే మెరుపులతో హోటల్ ప్రవేశ ద్వారాలు స్వాగతం పలుకుతుంటే..కిచెన్ రూంలో మాత్రం ఎలుకలు, ఎలుక విసర్జనాలు, గడువు ముగిసిన మసాలాలు ఉంటున్నాయి. వెరసి జనాల ఆరోగ్యం పాడు చేస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఇవన్నీ వెలుగు చూశాయి. గచ్చిబౌలిలో ది నవాబ్స్ రెస్టారెంట్‌లో వంటగది లోపల డ్రైనేజీ మూసుకుపోయి నీరు నిలిచిపోయినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తమ తనిఖీల్లో గుర్తించారు. వంటింటి కిటికీలు, తలుపులకు పురుగుల నియంత్రణ లేదని తేల్చారు.

స్టోర్ రూంలో ఎలుకల విసర్జన, ఎలుకలు తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. రిఫ్రిజిరేటర్లలో చికెన్, మటన్‌లపై లేబుల్ లేదని, దుకాణంలో దొరికే ఉల్లిపాయల పొడి, పెరి పెరి మిక్స్ కూడా లేబుల్ లేకుండా ఉన్నాయి. వంటగదిలో డస్ట్‌బిన్లను తెరిచే ఉంచారు. తెరిచి ఉన్న డస్ట్‌బిన్లను గుర్తించారు.

### గచ్చిబౌలి ఇందిరా నగర్‌లో..

గచ్చిబౌలి ఇందిరా నగర్‌లో లా విన్ ఎన్ రోజ్ కేఫ్‌లో కిచెన్ ఫ్లోర్, కేక్ తయారీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని తేల్చారు. గచ్చిబౌలిలోని బెర్లిన్ రెస్టారెంట్ అండ్ క్లబ్‌లో గడువు ముగిసిన పుట్టగొడుగులు, ఆపిల్ సైడర్ వెనిగర్, వెరుశనగ వెన్న, చైనీస్ మసాలా పొడి, నువ్వుల నూనె, మద్రాసు కరివేపాకు, మసాలా అల్లంపొడి, స్వీట్ కార్న్ వంటి పదార్థాలను సీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్‌లో లేబుల్ లేని ఆహార పదార్థాలు కనిపించాయి. తెరిచి ఉన్న డస్ట్‌బిన్‌లు దర్శనం ఇచ్చాయని అధికారులు పేర్కొన్నారు. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తెలిపారు.

# ఆ దారుల్లో.. చిమ్మ చీకటి

- గాడి తప్పిన స్ట్రీట్‌లైట్ వ్యవస్థ
- 20 శాతం వీధిదీపాలు వెలగనివే
- బకాయిలు చెల్లించలేని ప్రభుత్వం
- నిర్వహణలో చేతులెత్తేసిన ఏజెన్సీ
- గడిచిన 15 రోజులుగా నిరసన



సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో పలు ప్రాంతాలు, రహదారుల్లో వీధి దీపాలు లేక చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. 5.48 లక్షల వీధి దీపాలలో దాదాపు 20 శాతానికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. ముఖ్యంగా గత రెండు రోజులుగా అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్కు, బసవతారకం క్యాన్సర్ దవాఖానా నుంచి కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం వరకు రాత్రి సమయాల్లో వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో వాకర్లు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చీకట్లకు గల కారణం సదరు నిర్వహణ ఎజెన్సీ బల్దియా ఇవ్వాల్సిన బకాయిలపై పోరుబాట పట్టడమే. తమకు బల్దియా నుంచి రూ. 100కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందంటూ గడిచిన 15 రోజులుగా నిరసన తెలుపుతున్నారు. దీంతో వీధి లైట్ల నిర్వహణ గాడి తప్పింది.

### అంతా అస్తవ్యవస్థం

గ్రేటర్‌లో సుమారు 5.48 లక్షలకు పైగా వీధి దీపాలను నిర్వహించే బాధ్యతలను 2018 ఏప్రిల్ మాసం నుంచి ఏడేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్)కు అప్పగించిన సంగతి తెలిసిందే. వీటిలో పది శాతం స్ట్రీట్ లైట్లు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా వెలగడం, ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతుండగా, మిగిలిన వాటన్నింటిని మ్యాన్‌వల్‌గానే నిర్వహిస్తున్నారు. అయితే నిర్వహణలో ఈఈఎస్‌ఎల్‌పై తరచూ కార్పొరేటర్లు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. ఒకానొక దశలో గత కమిషనర్లు సైతం మందలించారు. ముఖ్యంగా వీధి దీపాల మరమ్మత్తుల పాలైనప్పుడు మార్చాల్సిన లైటు, ఇతర పరికరాలను ఎప్పటికీ సుమారు 15 శాతం రిజర్వ్ పెట్టుకోవాలన్న నిబంధన ఒప్పందంలో ఉన్నప్పటికీ దానిని ఈఈఎస్‌ఎల్ ఏ మాత్రం ఆమలు చేయకపోవడం, కొత్తగా పది కాలనీలకు విద్యుత్ సరఫరా మంజూరయినప్పటికీ స్తంభాలు వేసి, కరెంట్ తీగలను లాగడంతో పాటు వీధి దీపాలను బిగించాల్సిన ఈఈఎస్‌ఎల్ పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో తరచూ స్ట్రీట్ లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామంటూ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. వాస్తవంగా గ్రేటర్‌లో వీధి లైట్లు 5.48 లక్షలు ఉండగా రోజూ 98శాతం వెలగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 80 శాతం లోపే వెలుగుతున్నట్లు ఫిర్యాదుల ఆధారంగా కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అందుబాటులో నిత్యం 27,500 (5శాతం) ఉండాలి. కానీ కేవలం మూడు వేలు మాత్రమే ఉండడం గమనార్హం. ఈ క్రమంలోనే సదరు ఎజెన్సీ ప్రతినిధులతో కమిషనర్ ఇలంబర్తి సమావేశమై నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# లీజు..ఇక నుంచి పక్కాగా

- లీజు పూర్తయినవారికి నోటీసులివ్వండి
- ఆస్తులను కంప్యూటరీకరించండి
- ఒక్కో ఆస్తికి ఒక్కో ఐడీ కేటాయించండి
- అధికారులను ఆదేశించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : అక్రమ లీజుదారులు జీహెచ్‌ఎంసీ ఆస్తులను దర్జాగా అనుభవిస్తున్నారు. ఏళ్ల తరబడి లీజు గడువు ముగిసిన వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఎస్టేట్ విభాగం నిర్లక్ష్యం చేస్తున్నది. గజం స్థలానికి ఒక్క రూపాయి మాత్రమే అద్దె చెల్లిస్తున్న లీజు ఒప్పందాలు కూడా నేటికీ యథాతథంగా కొనసాగుతున్నాయి. అజాద్(మోతి) మార్కెట్ లీజుల గడువు... ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఏటా కోట్ల రూపాయల మేర జీహెచ్‌ఎంసీ ఖజానాకు గండిపడుతున్నా ఎస్టేట్ విభాగం అధికారుల్లో చలనం కరువైంది. వాస్తవంగా లీజు పూర్తయ్యాక అధికారులు ఆయా దుకాణాలను ఖాళీ చేయించాలి. మళ్లీ టెండర్ వేలం వేసి ప్రక్రియను కొనసాగించాలి. ఏడాదికొకసారి అద్దె విలువ 5 శాతం మేర పెంచాలి. కానీ ఘనత వహించిన ఎస్టేట్ విభాగం నోటీసులతోనే సరిపెడుతున్నది. ఇటీవల కాలంలో 14 యూనియన్ కార్యాలయాలతో పాటు 2300 షాపుల లీజుదారులకు నోటీసులు ఇచ్చారే కానీ ఇప్పటి వరకు పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలోనే ఎస్టేట్ విభాగం అధికారులపై పనితీరుపై కమిషనర్ ఇలంబర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో క్షేత్ర స్థాయి అధికారులు తెలుసా? అని కమిషనర్ ప్రశ్నించారు. అదే విధంగా కమ్యూనిటీ హాల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో, ఎవరి ఆధీనంలో ఉన్నాయో పరిశీలన చేసి నివేదిక సమర్పించాలన్నారు. వీటిని కూడా కంప్యూటరైజ్ చేసి లోకేషన్ కూడా పొందుపర్చాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమ్యూనిటీ హాల్స్ ఎవరి ఆధీనంలో ఉన్నాయో? ఎవరు వినియోగిస్తున్నారో వంటి వివరాలను సేకరించి అందజేయాలని కమిషనర్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

### వివరాలు పారదర్శకంగా..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి కంప్యూటరీకరించాలని అధికారులను ఇలంబర్తి ఆదేశించారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయినా ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అని క్షేత్ర స్థాయిలో జోనల్ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులు విచారించి నివేదిక అందజేయాలన్నారు. ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రార్ తప్పని సరిగా ఉండాలని, ఆస్తులు కంప్యూటరైజ్ చేసి అందులో పూర్తి వివరాలు ఉండాలని లీజు ఎప్పటి వరకు ఉంది? ఎప్పుడు పూర్తవుతుంది? వంటి వివరాలు పూర్తి సమాచారం ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. ఆస్తులు కంప్యూటర్‌లోనే ప్రజలకు పూర్తి వివరాలు తెలియాలని అధికారులను ఆదేశించారు. లీజు మార్కెట్ రేటు ప్రకారంగా కేటాయింపు జరగాలని, లీజు పూర్తయిన ఇంకా కొనసాగుతున్న వివరాలను పూర్తి నివేదిక అందజేయాలన్నారు. అంతేకాకుండా కంప్యూటర్ చేసేందుకు అవసరమైన ప్రత్యేకమైన డెవలపర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఐటీ అధికారులను ఆదేశించారు. అద్దె చెల్లింపు కూడా ఆన్ లైన్ ద్వారా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కొక్క ఆస్తికి ఒక ఐడి కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమీషనర్ సి. చంద్రకాంత్ రెడ్డి, యుసిడీ ప్రాజెక్టు డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.సురేష్ కుమార్, 30 సర్కిళ్ల ప్రాజెక్ట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.




సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ ఇలంబర్తి